క్లుప్తంగా

మంత్రి దామోదరకు సన్మానం



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దామోదర రాజ నర్సింహను కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, నాయకులు హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో సోమవారం సాయంత్రం ఆయనను కలిసి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హనుమంత్, మదన్ విశ్వనాథ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ ప్రారంభించాలి

- అడిషనల్ కలెక్టర్ మాధురికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న గొర్రెల కాపరుల సంఘం నాయకులు

సంగారెడ్డి: గొర్రెల పెంపకం దారుల సమస్యలపై జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురికి సోమవారం గొర్రె కాపరుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించాలని నాయకులు నవాబుగారి భూమయ్య, నగేశ్, ఇటిక్యాల్ నర్సింలు కోరారు.


తొలిమెట్టు అమలు పరిశీలన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో తొలిమెట్టు అమలు కార్యక్రమాన్ని సోమవారం ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర పరిశీలకులు శేషు, రాంబాబు, మౌనిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళిక, బోధన, విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన సామర్థ్యాలు పొందేవిధంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అంజయ్య, మండల నోడల్ అధికారి రుద్రప్ప, సీఆర్పీ నాగేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్న జంతువుల నిర్వహణపై వర్క్‌షాప్

పటాన్‌చెరు: ఎలుకలు, చుంచులు వంటి జంతువుల నిర్వహణ, వాటితో వ్యవహరించే తీరుపై గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఈ నెల 20, 21 తేదీలలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. లాబొరేటరీ యానిముల్ సైంటిస్ట్స్ అసోసియేషన్, ఐపీఏ స్టూడెంట్స్ ఫోరమ్ కలిసి ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు సోమవారం తెలిపారు. బయో మెడికల్ పరిశోధనలో ఉపయోగించే చిన్న జంతువుల నిర్వహణ, ప్రాథమిక పద్ధతులపై అవగాహన కలిగించనున్నారు. హైదరాబాద్ సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్‌కుమార్, శాస్త్రవేత్త ప్రొఫెసర్ హరిశంకర్ వక్తలుగా పాల్గొంటారు. ఆసక్తిగల వారు డాక్టర్ వినయాసిని 99491 23087 నంబర్‌ను సంప్రదించాలని వారు తెలిపారు.

సునీతారెడ్డి అభిమానుల పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభించిన శ్రీనివాస్‌రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతాలక్ష్మారెడ్డి విజయం సాధించడంతో హత్నూర మండలం చీకమద్దూర్ గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఏడుపాయల వనదుర్గ ఆలయం వరకు పాదయాత్ర ప్రారంభించారు. నాయకులు బేకరీ వసంత్, బాల్రాజ్ పాల్గొన్న పాదయాత్రను పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రసాదాన్ని ఎమ్మెల్యే సునీతకు అందిస్తామని వారి పేర్కొన్నారు.

అక్రిడేషన్ ప్రెస్ కమిటీ ఎంపిక

మునిపల్లి(అందోల్): అక్రిడేషన్ ప్రెస్ నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా విఠల్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండలంలోని బుదేరాలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యక్షుడుగా అబ్దుల్ రహీం, బండారు లక్ష్మణ్, సలహాదారులుగా చోటు మియా, కోశాధికారిగా తలారి భుజంగ, సభ్యులుగా నర్సింలు, థామస్, ఇర్ఫాన్, మల్లేశం ఎంపికయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- నేతలు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్‌పట్లోళ సంజీవరెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంపీపీ జయశ్రీమోహన్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. సోమవారం నాగల్‌గిద్ద, మనూరు మండల సర్వసభ్య సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, రాథోడ్ మోతి బాయి అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచిన ఖేడ్ ప్రజల ఆశలను వమ్ము కానియ్యమని స్పష్టం చేశారు. రోడ్లు, వైద్యం, విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ తప్పని సరిగా ఉండాలన్నారు. స్థానిక నాయకులు వారివారి గ్రామాల్లో పాఠశాలలను సందర్శించి తగు సూచనలు, సలహాలు అందించాలన్నారు. మిషన్ భగీరథ తాగునీరు, గొర్రెల పంపిణీ, రోడ్ల నిర్మాణం లాంటి సమస్యలను ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో హెల్త్ సెంటర్లు మంజూరైనా నిర్మాణాలు కొనసాగలేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విన్నవించారు. సమావేశంలో మనూరు ఎంపీడీఓ షాజిలొద్దిన్, నాగల్‌గిద్ద ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొంది మండల సర్వసభ్య సమావేశాలలో పాల్గొన్న డాక్టర్ పట్లోళ సంజీవరెడ్డికి ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అమ్రునాయక్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండడంతో మండల సర్పంచ్‌లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీపీ జయశ్రీమోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

అధికారుల గైర్హాజరు.. నేతల మండిపాటు



ఫోన్లలో నిమగ్నమైన అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామాలలోని సమస్యల గురించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించేందుకు ప్రతి మూడు నెలలకొకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. అందులో భాగంగా సోమవారం కొండాపూర్‌లో ఎంపీపీ మనోజ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాని అధికారులు గైర్హాజర్ కావడంతో నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన కొందరు అధికారులు సమావేశం జరుగుతున్న సమయంలో మొబైల్ ఫోన్లలో నిమగ్నమయ్యారు. పాలక వర్గం ఏర్పడి ఐదేళ్లు కావస్తున్నా మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రతి సమావేశంలో వాటిపై చర్చించినా నేటికీ పరిష్కారం లభించలేదని పలువురు సర్పంచ్‌లు వాపోయారు. చాలా మంది అధికారులకు గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎవరో కూడా తెలియని దుస్థితి ఉందని ఆరోపించారు. లక్షల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామని, రెండేళ్ల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పాలక వర్గానికి ఇదే చివరి సమావేశం కావచ్చని, ఐదేళ్లుగా అభివృద్ధికి సహకరించిన నేతలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీలు భాస్కర్ రెడ్డి, నర్సింహారెడ్డి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రకాళీరాచన్నస్వామి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జహీరాబాద్: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని బడంపేట గ్రామంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాచన్నస్వామి ఆలయం ప్రాంగణంలో భద్రకాళీ సమేత రాచన్న స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సోమవారం ఆలయ అర్చక బృందం వేద మంత్రోచ్చరణ నడుమ వైభవంగా జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప, ఉపసర్పంచ్ రాజన్నతో పాటు మహదేవ్, కై లాస్, ఉమాపతి, వీరశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న హానేస్టి ఇన్‌ఫ్రా సంస్థ ప్రతినిధులు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హానేస్టి ఇన్‌ఫ్రా సంస్థ ప్రతినిధులు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆ సంస్థకు చెందిన గోపాల్‌యాదవ్, రాజ్‌కుమార్ పెద్దారెడ్డిపేట, మంతూర్, రాయిపాడ్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దారెడ్డిపేట సర్పంచ్ సతీశ్‌కుమార్, మంతూరు సర్పంచ్ శివ్వమ్మ పాల్గొన్నారు. దాతలకు వారు ఘనంగా సన్మానం చేశారు.

రక్తదానంతో.. ప్రాణదానం

ఎంపీపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: రక్తదానం చేయడం ద్వారా ఒకరికి ప్రాణదానం చేసిన వాళ్లమవుతామని ఎంపీపీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ఎస్.గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో కార్యకర్తల సమక్షంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అన్నారు. పలువురు పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో వ్యవసాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని కౌడిపల్లి మండలం తునికిలోని రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ (కృషి విజ్ఞాన కేంద్రం) శాస్త్రవేత్త శ్రీనివాస్, విద్యార్థులు, రైతులకు సూచించారు. మండలంలోని రుస్తుంపేటలో సోమవారం వారు గ్రామపటాన్ని రూపొందించి రైతులకు ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రతీ రైతు తమ పొలంలో పంటలు సాగుచేసే ముందు మట్టి నమూనాలను సేకరించి వ్యవసాయ శాస్త్రవేత్తలతో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూ పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఆయా భూముల్లో అనువుగా ఉండే పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. తరచూ పంట మార్పిడి చేయడంతో పాటు ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఆరుతడి పంటలతో తక్కువ పెట్టుబడి, నీటితో అధిక దిగుబడులు పొందొచ్చని వివరించారు. నారుమళ్ల మొదల నుంచి పంట చేతికొచ్చే వరకు ఎప్పటికప్పుడు చీడపీడల నివారణతో పాటు కావాల్సిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ భాస్కర్ రాజు, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్, విద్యార్థులు కీర్తి తేజ, నాగ ప్రసన్న, చందా పల్లవి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 20 మందికి జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. శనివారం, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నామని, వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



ఆస్పత్రిలో వృద్ధురాలి మృతదేహం

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వృద్ధురాలు(70) చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం రాత్రి బీదర్ క్రాస్‌రోడ్డు వద్ద పక్కన నిలుచుని ఉండగా ఆమెను గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో గాయపడిన ఆమెను జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృత దేహాన్ని ఆస్పత్రిలో భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 56763 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సప్తాహ కార్యక్రమం

నారాయణఖేడ్: మంగల్‌పేట్‌లోని కల్పన ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ప్రముఖ పురోహితుడు మలమంచి మోహన్‌జోషి ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. జ్ఞానేశ్వర్ మహారాజ్ కీర్తనలు వినిపించారు. కార్యక్రమంలో ఖేడ్ పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 160 దుకాణాల సముదాయం నిర్మాణ పనులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే వ్యాపారస్తులు, రైతులకు ఎంతో ఉపయోగం అన్నారు. సకాలంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని డోవూర్ తండాకు చెందిన సరోజాబాయికి మాజీ ఎమ్మెల్యే సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే చికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమెకు రూ.60 వేల చెక్కు మంజూరైంది. దానిని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం ఆమెకు అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, రైతుబంధు మండల సమన్వయ సమితి అధ్యక్షుడు జనార్దనరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సలీం, కంగ్టి మండల నాయకులు సంతోష్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఎమ్మెల్యేను సన్మానించిన ఎరుకల సంఘం నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): నియోజకవర్గ పరిధిలో గల ఎరుకల కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హామీ ఇచ్చారు. సోమవారం సదాశివపేట పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద తెలంగాణ ఎరుకల సంఘం నేతలు ఆయనను కలిసి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండలపురం గోపాల్, మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు విఠల్, మహేందర్, మాణయ్య, నర్సింలు, రాజు, సంతోష్, సుభాష్, దుర్గేశ్, రఘు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'సంజీవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి'



ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న బాపుమల్‌శెట్టి

నారాయణఖేడ్: ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ సంజీవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి కోరారు. సోమవారం ఆయన ఎమ్మెల్యేను కలిసి గొంగడితో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ వెనుకబడి, వలసలకు పేరుగాంచడానికి కారణం ఈ ప్రాంతానికి మంత్రి పదవి దక్కకపోవడమేనన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవింద్‌యాదవ్, సీనియర్ న్యాయవాది కిషన్‌రావు, సంఘం నాయకులు దత్తుగౌండ, బాబన్న, విఠల్, బాగయ్య, పండరి, భూంగౌండ పాల్గొన్నారు.

మైత్రీ ఫౌండేషన్ మండల కార్యదర్శిగా పాండు



నియామక పత్రం అందుకుంటున్న పాండు

హత్నూర (సంగారెడ్డి): మైత్రి ఫౌండేషన్ హత్నూర మండల కార్యదర్శిగా నవపేట గ్రామానికి చెందిన జక్కుల పాండును నియమించారు. ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా ఉచిత విద్యా, వైద్యం లాంటి సేవా కార్యక్రమాలను చేస్తూ హత్నూర మండలానికి విస్తరిస్తున్నామని, అలాగే గుమ్మడిదల మండలలో రెండేళ్ల నుంచి ఉచిత అంబులెన్స్ సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ చెన్నాంచెట్టి ఉదయ్ కుమార్, మీడియా కోఆర్డినేటర్ ఉదయ్ సాగర్, సభ్యులు గణేశ్, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో.. శివనామస్మరణ



స్వామి దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: స్థానిక జేపీ కాలనీలోని శ్రీఉమామహేశ్వర ఆలయం, టోల్‌గేట్ సమీపంలోని శ్రీరామలింగేశ్వర దేవస్థానం కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఉమామహేశ్వర ఆలయంలో స్వామికి భస్మాభిషేకం, అదే విధంగా రామలింగేశ్వర దేవ స్థానంలో 108 కళశలతో ప్రత్యేక అభిషేకం చేసి, 12 రకాల హారతులిచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

బకాయి స్కాలర్‌షిప్‌లపై సీఎం చర్చించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేశ్



సంగారెడ్డి అర్బన్: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



జోగిపేటలో మాట్లాడుతున్న మహేశ్

సంగారెడ్డి అర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎం చర్చించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేశ్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందని, దీంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శీను, కార్తీక్, ప్రశాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి..

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ కార్యదర్శి రాజేశ్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. మూడు సంవత్సరాల నుంచి విద్యార్థుల స్కాలర్‌షిప్లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందన్నారు. దీని వల్ల పేద విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. హాస్టల్ మెస్ చార్జీలను కూడా విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

జోగిపేట(అందోల్): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జోగిపేట ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కుమార్, రాజు రెడ్డి, నితిన్, మహేశ్, అఖిల్ తదితరులు ఉన్నారు.